క్లుప్తంగా

ఏనుగుల సంచారంపై సమాచారం ఇవ్వరూ!

సదుం: గ్రామాలలో ఏనుగులు సంచరిస్తున్నట్లు తెలిస్తే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ట్రాన్స్‌కో ఏడీఏ నరేంద్ర, ఏఈ ఖాదర్ ఇలాహీ మంగళవారం విజ్ఞప్తి చేశారు. కొన్ని రోజుల క్రితం బూరగమంద పరిసర అటవీ ప్రాంతంలో కరెంటు షాక్‌తో ఏనుగు మృతి చెందిందని, ప్రస్తుతం మండలంలో ఏనుగులు సంచరిస్తుండటంతో వాటి గురించి తెలియజేస్తే ఆ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి ఏనుగులు మృత్యువాత పడకుండా చూసేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. విద్యుత్ పరికరాలను ఏనుగులు ధ్వంసం చేసినా సమాచారం ఇవ్వాలని కోరారు.

భోజన కార్మికులకు శిక్షణ


శిక్షణకు హాజరైన మధ్యాహ్న భోజన కార్మికులు

రొంపిచెర్ల: ప్రభుత్వ పాఠశాలలో గోరుముద్ద పథకంలో విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో భోజనం పెట్టాలని ఎంఈఓ ఇందిర ఆదేశించారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకుఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వం పేద పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తోందన్నారు. విద్యార్థులకు మధ్యాహ్నం పౌష్టిక విలువలతో భోజనం పెట్టాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమని, ఈ దిశగా మెనూ ప్రకారం రోజూ భోజనం పెట్టాలన్నారు. విద్యార్థులకు పెట్టే భోజనంలో ఎవరూ రాజీ పడకూడదన్నారు. అనంతరం భోజన కార్మికులకు భోజన తయారీపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో బండకిందపల్లె ప్రాథమిక పాఠశాల భోజన తయారీ కార్మికురాలు లక్ష్మి మొదటి స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 శ్రీనివాసులు, సీఆర్‌పీలు రాజేంద్ర, కిరణ్, అన్నసూయ, రిసోర్స్ పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు

పుంగనూరు: పాఠశాలలు పునఃప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మంగళవారం మండలంలోని 139 పాఠశాలలకు 25,205 పుస్తకాలు చేరినట్లు ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 1 నుంచి 7 తరగతులకు పాఠ్యపుస్తకాలు, వర్క్ పుస్తకాలు, అలాగే వీటితో పాటు 1 నుంచి 9వ తరగతి వరకు ఉర్దూ పాఠ్యపుస్తకాలు అందాయన్నారు. పాఠశాలలు తెరవగానే విద్యార్థులకు పంపిణీ చేసేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పుస్తకాలను ముందుగానే పంపిణీ చేస్తామని తెలిపారు.

డీజిల్, మూడు బైక్‌లు సీజ్

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరులో మంగళవారం స్థానిక ఎస్‌ఐ శివకుమార్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సెర్చ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 60 లీటర్ల డీజిల్, రికార్డులు సక్రమంగా లేని మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

రుతుక్రమంలో పరిశుభ్రత ముఖ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సదుం: రుతు క్రమం సమయంలో మహిళలు పరిశుభ్రత పాటించాలని సీహెచ్‌ఓ రషీద్ అన్నారు. రుతుక్రమం, పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళల్లో రుతుక్రమం ఆరోగ్యవంతమైన సాధారణ ప్రక్రియ అని తెలిపారు. ఆ సమయంలో తగిన పోషకాహారం, విశ్రాంతి తీసుకోవాలన్నారు. బట్టలకు బదులు శానిటరీ నాప్కిన్స్ వాడాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈరోజు

కోనేటిరాయుని కల్యాణోత్సవం

గంగవరం: మండలంలో ప్రసిద్ధిగాంచిన టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో బుధవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులు రూ. 300 చెల్లించి సంప్రదాయ దుస్తులతో పాల్గొనవచ్చన్నారు. కల్యాణోత్సవం అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

కౌంటింగ్ ఏజెంట్లకు సమావేశం

పుంగనూరు: జూన్‌4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు విషయమై కౌంటింగ్ ఏజెంట్లకు బుధవారం ఉదయం ఉదయం 10:30 గంటలకు తమ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు రిటర్నింగ్ ఆఫీసర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పార్టీల నాయకులకు సమావేశం నిర్వహించి, కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కౌంటింగ్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. ఏజెంట్లు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం

- సంక్షేమ పథకాల విజయానికి సోపానం
- ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు
- పార్టీ నేతలతో ఆత్మీయ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే


హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు

వి.కోట: అందరి ఆశీస్సులు, సమష్టి కృషితో మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం తథ్యమని, అలాగే పలమనేరు నియోజకవర్గంలోనూ విజయబావుటా ఎగురవేస్తామని ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు జోస్యం చెప్పారు. మంగళవారం పట్టణంలోని ఏకే కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలు, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, 2014కు ముందు వి.కోట మండలం టీడీపీకి కంచుకోటగా పేరుండేదని, అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి మూలాన వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా మారిపోయిందన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి అందిన సంక్షేమ పథకాలే మన విజయానికి సోపానాలన్నారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల నుంచి ముఖ్య నేతల వరకు అందరూ మరోసారి పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కృషిచేశారని, వారందరికీ రుణపడి ఉంటానన్నారు. 2019లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి, రికార్డు బద్దలు కొట్టి, జగనన్నకు బహుమతిగా అందించారన్నారు. పార్టీ సిద్ధాంతాలు, అధిష్టానం చూపిన మార్గదర్శకాలే విజయానికి నాంది అని అన్నారు. 4వ తేదీ వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ అత్యధిక సీట్లతో ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ జగనన్న జూన్ 9న సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. సమావేశంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలగురునాథ్, రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, వైస్ ఎంపీపీలు లక్ష్మన్ రెడ్డి, తమీమ్, నాయకులు అబ్బూఖాన్, ధవనంభక్త, తుకారం, ప్రతాప్‌రెడ్డి, కృష్ణమూర్తి, శశికళ, కుమారాజా, శ్రీరాములురెడ్డి, అమరనాథ్, పూలనాగ, భూపతి, శ్రీనివాసులు, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ విజయం మనదే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: జూన్ 4న నిర్వహించే ఎన్నికల ఫలితాల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ఘన విజయం తప్పదని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. పలమనేరు రూరల్ మండల నాయకులతో మంగళవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. వారందరి ఆశీస్సులతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను ఎవరూ నమ్మడం లేదన్నారు. గత ఎన్నికల్లో మహిళలకు పసుపు కుంకుమ పేరిట ఆయన చేసిన మోసాలను ఇంకా మహిళలు గుర్తు పెట్టుకొనే ఉన్నారన్నారు. జగనన్న నవరత్నాలనే టీడీపీ కాపీ కొట్టిందని అపహాస్యం చేశారు. సమావేశంలో మండల కన్వీనర్ బాలాజీనాయుడు, విశ్వనాథ రెడ్డి, రాజారెడ్డి, చెంగారెడ్డి, పలువురు సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

నక్కపల్లెలో జాతరోత్సాహం


నక్కపల్లె జాతరలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు

పలమనేరు: మండలంలోని నక్కపల్లెలో మంగళవారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే జాతర వేడుకలకు హాజరయ్యారు. కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండేందుకు పండుగలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. సంస్కృతీ, సంప్రదాయాలు, పండుగలు, జాతరలు..మొదలైనవన్నీ వారసత్వ సంపదగా గుర్తెరిగి వాటిని ఆనందంగా జరుపుకోవాలన్నారు. జాతరకు మొరం పంచాయతీ ప్రజలతో పాటు పలు గ్రామాల వారు హాజరై మొక్కులు చెల్లించారు. బుధవారం జలధితో జాతర ముగియనుంది. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలాజీనాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, రాజారెడ్డి, చెంగారెడ్డి, సర్పంచులు జగన్‌మోహన్ రెడ్డి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం.. మహిళకు గాయాలు


చికిత్స పొందుతున్న నందిని

పుంగనూరు: ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కింద పడి మహిళ గాయపడిన సంఘటన మంగళవారం మండలంలోని గూడూరుపల్లె సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు..మండలంలోని సింగిరిగుంటకు చెందిన నందిని(32) కూలీ పనులకు వెళ్లేందుకు తన ద్విచక్రవాహనంలో గూడూరుపల్లెకు వెళ్తుండగా ప్రమాదానికి గురైంది. ఎదురుగా వాహనాన్ని తప్పించబోయే ప్రయత్నంలో ఆమె అదుపు తప్పి కింద పడింది. తీవ్రగాయాల పాలైన ఆమెను స్థానికులు 108 అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు.

వేడుకగా గంగజాతర


మూడవగేటు వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్(కాణిపాకం) : చిత్తూరు నగరంలోని పలుచోట్ల మంగళవారం గంగజాతరను వేడుకగా నిర్వహించారు. మురుగానిపల్లె, మూడవ గేటు, ఇరువారం, కట్టమంచి తదితర ప్రాంతాల్లో వేకువజామునే అమ్మవారిని కొలువుదీర్చారు. తొలిపూజ చేసి తెరను లాంఛనంగా ప్రారంభించారు. దీంతో భక్తులు ఊరేగింపు గా వచ్చి అమ్మవారికి అంబలి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం విశేష పూజలు చేశారు. పంబ వాయిద్యాల నడుమ భక్తులు అమ్మవారి పూజించారు. రాత్రి పిండివంటలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. రాత్రి వీధి నాటకాలు ప్రదర్శించారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం


మిట్టపల్లెలో నిర్వహిస్తున్న ప్రచారం

సదుం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగిన ఉండాలని తైత్ర సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్ కోరారు. మండలంలోని కారేవాండ్లపల్లె, గుట్టపల్లె, గొల్లపల్లె తదితర గ్రామాల్లో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు పెంచల రత్నం, మహేంద్ర, మధు, మల్లేశ్వరి, మధుప్రియ, వెంకటసుబ్బమ్మ, రమణయ్య, రత్తమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో ఆస్పత్రి పాలు


పాము కాటుకు గురైన శ్రీధర్

పుంగనూరు: పాముకాటుకు గురై ఇద్దరు ఆస్పత్రి పాలైన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని బత్తాలపురం గ్రామానికి చెందిన శ్రీధర్ గడ్డివామిలో గడ్డి తీస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. అలాగే చౌడేపల్లె మండలం పుదిపట్లకు చెందిన శ్యామల పొలం పనులు చేస్తుండగా ఉదయం పాముకాటుకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యసేవలతో ఇద్దరూ కోలుకుంటున్నారు.

లైబ్రరీకి పుస్తకాల వితరణ

చిత్తూరు కార్పొరేషన్: నగరానికి చెందిన రచయితలు శాంతాభాస్కర్, హరినాయుడు మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కార్యదర్శి శర్మను కలిసి రామాయణం, భాగవతం, నీతి కథలు, మహిళా శాస్త్రవేత్తల విజయగాథల పుస్తకాలను మొత్తం 420 కాపీలను అందజేశారు. పుస్తక పఠనంపై పిల్లల్లో ఆసక్తి పెంచేందుకు వీటిని అందజేసినట్లు దాతలు తెలిపారు. గ్రంథాలయాధికారి మధుబాబు పాల్గొన్నారు.

వైభవంగా గంగమాంబ జాతర


పట్టణంలో అమ్మవారి పుష్పపల్లకి


పట్టణంలో పూలగెరిగతో నిర్వహిస్తున్న ఊరేగింపు


భక్తులకు విశ్వరూప దర్శనమిస్తున్న గంగమాంబ

వి.కోట: పట్టణంలో శ్రీ గంగమాంబ జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి అమ్మవారి శిరస్సును, అమ్మవారిని పుష్పపల్లకిపై పురవీధుల్లో బాణసంచా మోత, డప్పులు, మంగళ వాయిద్యాల హోరు నడుమ ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయం వద్ద వందలాది మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం నిర్వాహకులు అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. వందలాది మంది మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు వండి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అలాగే పట్టణం నుంచి భక్తులు దీపాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. పట్టణంలో భక్తులు పూలగెరిగతో ఊరేగింపు నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాజీ సర్పంచ్ పీఎం బసప్ప జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆలయం వద్ద మంగళవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారుల భక్తిపూర్వక నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి ఆలయ కమిటీ సభ్యులు ఆలయం వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలు, అంబలి, శీతల పానీయాలు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.


భక్తజనంతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

పోటెత్తిన వజ్రాలపురం బోయకొండ

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయం మంగళవారం భక్త జనంతో పోటెత్తింది. అమ్మవారి 25వ వార్షిక జాతర కార్యక్రమంలో భాగంగా రెండో రోజు అమ్మవారు భక్తులకు నిజరూప దర్శనంతో అనుగ్రహించారు. ఉదయం అమ్మవారికి అంబలి, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారి మూలవిగ్రహం, ఉత్సవ మూర్తులను వివిధరకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర గ్రామస్తులతో పాటు కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకున్నారు. బొమ్మాయిపల్లెకు చెందిన పారిశ్రామికవేత్త ఈశ్వర్‌నాయుడు, మమత ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, కార్యనిర్వాహకులు గోపి పురుషోత్తం, కమిటీ సభ్యులు శివలింగయ్య, బుస్సా నాగరాజగౌడ్, రాజేంద్రనాయుడు, రామూర్తినాయుడు, సుబ్బా నాయుడు, బుజ్జి, శంకరయ్య, మురళి, తులసి, వేణుగోపాల్‌నాయుడు, పట్టాభి, బాబు, ఆలయ మేనేజర్ మొగిలప్ప పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెంలో మంగళవారం గంగమ్మ జాతర వేడుకగా ప్రారంభం అయ్యింది. ఉదయం అమ్మవారికి అంబలి, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించి బుధవారం వేకువ జామున నడివేధిలో కొలువు దీర్చనున్నారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొగిలి వెంకటగిరిలో..

మండలంలోని మొగిలి వెంకటగిరిలో మంగళవారం గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక ప్రతిభావంతుల గుర్తింపుపై సర్వే


పలమనేరు: ప్రత్యేక అవసరాల వారిని గుర్తించేందుకు ఇంటింటా చేస్తున్న సర్వే


గుడుపల్లె: ఇంటింటా సర్వే చేస్తున్న ఐఈఆర్‌పీ అధికారులు

బైరెడ్డిపల్లె: 18 ఏళ్లలోపు వయసున్న ప్రత్యేక ప్రతిభావంతులను మండలంలో గుర్తించడానికి సర్వే చేస్తున్నట్టు సహిత విద్య ఉపాధ్యాయులు నిర్మల కుమారి, సుభాషిణి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రత్యేక ప్రతిభావంతులను గుర్తించి శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. గ్రామాల్లో పర్యటిస్తున్న సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. మంగళవారం 13 మందిని గుర్తించి ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతుల శిక్షణ కేంద్రంలో చేర్పించినట్లు తెలిపారు. ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఉచితంగా అందుతాయని వివరించారు.

పుంగనూరులో..

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి , వారికి గుణాత్మక విద్య, ఆరోగ్యం, ఫిజియోథెరపీతో పాటు అలవెన్సులు ఇచ్చేంచేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి తెలిపారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో భవిత ఉపాధ్యాయులు వెంకట్రమణ, అరుణమ్మతో కలసి తల్లిదండ్రులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. 9 మంది ప్రత్యేక ప్రతిభావంతులను గుర్తించి భవిత పాఠశాలలో నమోదు చేశారు. ఎంఈవో మాట్లాడుతూ డ్రైవ్ కార్యక్రమాన్ని జూన్ 9 వరకు నిర్వహిస్తామన్నారు. పిల్లలకు వివిధ రకాల ఉపకరణాలు, వైద్యపరీక్షలు చేసి, వారి భవితకు బాటలు వేయనున్నట్టు చెప్పారు.

99 మంది దివ్యాంగుల గుర్తింపు

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలో 99 మంది దివ్యాంగులను గుర్తించినట్లు సహిత ఉపాధ్యాయులు అములు, మానస తెలిపారు. వారు మంగళవారం మండలంలో దివ్యాంగుల కోసం సర్వే చేశారు. వారు మాట్లాడుతూ, 2023 సంవత్సరంలో 90 మంది దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. ఈ ఏడాది మరో 9 మంది దివ్యాంగుల పిల్లలను గుర్తించినట్లు చెప్పారు. వీరి కోసం రొంపిచెర్ల తెలుగు ప్రాథమిక పాఠశాలలో సహిత పాఠశాలను ఏర్పాటు చేశామని, ఇక్కడ దివ్యాంగులకు విద్యతోపాటు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. అలాగే ప్రత్యేక ప్రతిభావంతుల సర్టిఫికెట్లు తీసి ఇచ్చి పెన్షన్ మంజూరు చేయిస్తామని తెలియజేశారు. పిల్లలను సహిత పాఠశాలకు తీసుకువచ్చే వారికి రవాణా సాయాన్ని అందజేస్తామని తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

గుడుపల్లె: జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల(వికలాంగులు) పిల్లలు గుర్తించడానికి మండలంలో సర్వే చేసినట్లు ఐఈఆర్‌పీ ప్రభ తెలిపారు. ఈ నెల 1వ తేది నుంచి 28 వరకు సర్వే చేశామన్నారు. 10 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నట్లు సర్వేలో గుర్తించామన్నారు. వీరికి మండలంలోని భవిత కేంద్రంలో అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు.

పలమనేరులో...

పలమనేరు: మండలంలో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే మంగళవారం స్థానిక విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. 18 ఏళ్ల లోపు వయసున్న ప్రత్యేక అవసరాల వారిని గుర్తించేందుకు డోర్ టు డోర్ సర్వే చేశారు. సర్వేలో గుర్తించిన ప్రత్యేక అవసరాల వారికి ఏపీ ఉపకరణాలు కావాలో వాటిని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని ఎంఈఓ లీలారాణి తెలిపారు. ఇప్పటి వరకు పదిమంది పిల్లలను గుర్తించినట్లు మండల కో–ఆర్డినేటర్ ప్రభాకర్ వర్మ తెలిపారు. ఇలాంటి పిల్లలున్న తల్లిదండ్రులు తమ సెల్‌ఫోన్ నంబర్లకు 98853 77508,986638308 ఫోన్ చేయాలని కోరారు.


బైరెడ్డిపల్లె: లక్కనపల్లెలో సర్వే చేస్తున్న సహిత విద్య ఉపాధ్యాయులు నిర్మలకుమారి, సుభాషిణి


రొంపిచెర్ల: గానుగచింతలో దివ్యాంగుల సర్వే చేస్తున్న సహిత ఉపాధ్యాయులు


పుంగనూరు: ప్రత్యేక ప్రతిభావంతుల్ని గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న టీచర్లు